సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 19 । జూన్ । 2024



శాస్త్రీయ సంరక్షణతో..

గొర్రెల పెంపకం లాభాదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. 8లో▸



ఆలయ స్థలం అన్యాక్రాంతం

బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన సంతాన వేణుగోపాలస్వామి ఆలయ స్థలం అన్యాక్రాంతం అవుతోంది. 8లో▸



సజావుగా యూజీసీ నెట్

యూజీసీ నెట్ పరీక్షను మంగళవారం నిర్వహించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్
- రికార్డుల పరిశీలన, వైద్య సేవలపై ఆరా



ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 30 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె రోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్పత్రుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు తీసుకొచ్చి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తయ్యేలా చూస్తామన్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి ఎందుకు వాడటం లేదని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి హాజరై రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఇన్‌చార్జీ ఎంపీపీ కె.సునీతా నాయక్, ఎంపీడీఓ శైలజ, మహేశ్వరం ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

21నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

అనంతగిరి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్స్‌లో (హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్) 4వ తరగతిలో ప్రవేశాల కోసం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంఈఓ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపికలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి జూలై 3న జిల్లా స్థాయి (వికారాబాద్‌లో బ్లాక్ గ్రౌండ్)లో ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జూలై 11, 12 తేదీల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

23న మెగా జాబ్‌మేళా

టీజీ స్టెప్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 23న వికారాబాద్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 60కిపైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. వివిధ కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో హాజరుకావాలని సూచించారు.

విత్తు.. రైతు చిత్తు



మాడ్గుల్‌కు చెందిన బత్తుల కొండల్ రెడ్డి పత్తి సాగుకు సిద్ధమయ్యాడు. పక్షం రోజుల క్రితం వర్షాలు కురవడంతో విత్తనాల కొనుగోలు కోసం మాల్ మార్కెట్‌కు వచ్చాడు. ఓ దుకాణానికి వెళ్లగా ఆ వ్యాపారి విత్తనాల కొరత ఉందని, అదనంగా చెల్లిస్తే ఎన్ని ప్యాకెట్లయినా తెచ్చి ఇస్తానని చెప్పాడు. అదును దాటితే విత్తనాలు విత్తినా ప్రయోజనం ఉండదని భావించిన రైతు ఆ వ్యాపారి చెప్పినట్టు ఒకేసారి ఓ కంపెనీకి చెందిన 130 ప్యాకెట్లు కొనుగోలు చేశాడు. ప్యాకెట్‌పై ఎంఆర్‌పీ రూ.864 ఉండగా వ్యాపారి ఒక్కో ప్యాకెట్‌కు రూ.1,300 వసూలు చేశాడు. దీంతో ఆ రైతు రూ.56,680 నష్టపోవాల్సి వచ్చింది.

మార్కెట్‌లో పత్తి విత్తనాల దందా

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఎంఆర్‌పీ కంటే రెట్టింపు రేట్లకు విక్రయం
- అదును దాటుతోందని ఆందోళన
- అదనంగా చెల్లించి నష్టపోతున్న రైతులు

యాచారం: విత్తనాలు విత్తే అదును దాటిపోతుందనే సాకుతో వ్యాపారులు మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది రైతులు బ్లాక్‌లో పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. రెండేళ్లుగా పత్తికి క్వింటాల్‌కు రూ.7 వేలకు పైగానే మార్కెట్లో ధర కలకడంతో పంట సాగు చేసిన రైతులు ఆశించిన లాభాలు పొందారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా లక్ష 27 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది లక్ష 74 వేలకుపైగా ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సాగు విస్తీర్ణం పెరగొచ్చనే ఉద్దేశంతో జిల్లా వ్యవసాయ శాఖ విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు, రశీదులు పొందడం, ధర చెల్లింపులపై విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఎంత చేసినా వ్యాపారులు మాత్రం విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. సరైన ఆధారాలు లేవని వ్యవసాయ శాఖ చేతులెత్తేస్తోంది.



ఓ రైతు కొనుగోలు చేసి ఇంట్లో ఉంచుకున్న పత్తి విత్తన ప్యాకెట్లు

ఇప్పటికి 40 వేల ఎకరాల్లో..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకుని మరో లక్షన్నర ఎకరాలకు పైగా సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. యాచారం, మాడ్గుల్, ఆమనగల్లు, తలకొండపల్లి, కందుకూరు, కడ్తాల్, షాద్‌నగర్, కొత్తురు, మంచాల తదితర మండలాల్లో అత్యధికంగా పత్తి సాగు చేస్తారు. దిగుబడి అధికంగా వస్తుందని, చీడపురుగులు పట్టవనే ప్రచారంతో వ్యాపారులు మార్కెట్లో వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలను విక్రయిస్తున్నారు. ఆపై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తడం కోసం ఆయా గ్రామాల్లోని వందలాది మంది రైతులు రూ.లక్షల్లో ఖర్చు చేసి వేలాది ప్యాకెట్లను అధిక ధరకు కొనుగోలు చేసి దాచి పెట్టుకున్నారు. విత్తనాలు విత్తన నాటి నుంచి సరైన వర్షాలు కురవకపోవడంతో కొన్ని గ్రామాల్లో మొలకెత్తని పరిస్థితి ఉంది. దీంతో రూ.లక్షల్లో ఖర్చు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటముడి ఒప్పందంతో..

జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా పంటముడి ఒప్పందం కొనసాగుతోంది. ఆర్థికంగా చితికిపోయిన రైతులు పంట సాగుకు పెట్టుబడులు లేక విత్తనాల విక్రయించే వ్యాపారులతో ఒప్పందం చేసుకుంటున్నారు. దీని ప్రకారం రైతుకు కావాల్సిన పత్తి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారులు సమకూరుస్తారు. పంట పండి దిగుబడి రాగానే ఆ వ్యాపారులే కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసే సమయంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు వడ్డీతో సహా లెక్కించి వసూలు చేస్తారు. ఇలా మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువకే కొనడంతోపాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకుల్లో కొత్త రుణాలు ఇవ్వకపోవడం, రైతుబంధు నిధులు జమ కాకపోవడంతో అదును పోతుందనే ఆందోళనతో అనేక మంది రైతులు పంటముడి ఒప్పందం చేసుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఎంఆర్‌పీ కంటే పైసా ఇవ్వొద్దు



విత్తనాల ప్యాకెట్‌పై ఉన్న ధరకే కొనుగోలు చేయాలని, రశీదులు పొందడంపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాం. ఎంఆర్‌పీ కంటే పైసా ఇవ్వొద్దు. జిల్లాలో ఏ దుకాణంలోనైనా వ్యాపారులు అదనంగా వసూలు చేస్తే ఆ మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలి. బాధ్యులైన వ్యాపారులపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపిస్తాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి



చేవెళ్ల సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

‘నులి’మేద్దాం.. నివారిద్దాం

- నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు
- 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి పంపిణీ
- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు

షాబాద్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1–2 సంవత్సరాల వయస్సు వారికి సగం మాత్రను, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి పూర్తి ట్యాబ్లెట్ ఇవ్వనున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల చేత మాత్రలు మింగించేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ పూర్తి చేశారు.

ఆరోగ్యకరమైన సమాజం నిర్మించుకుందాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: నులిపురుగులు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని చేవెళ్ల డిప్యూటీ డీహెంచ్‌ఓ దామోదర్ అన్నారు. మండలకేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 నెలల నుంచి 19 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. 20న ఈ కార్యక్రమం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అనివార్య కారణాలతో ఎవరైనా మిగిలిపోతే 27న మరోసారి మాత్రలు వేయించనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఉండే ఓ టీచర్‌ను నోడల్ అధికారిగా కేటాయించటం జరుగుతుందని, వారే అందరికీ మాత్రలు వేశారా లేదా అన్నది చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మాత్రలతో ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కీలో నాలుగు కొత్త కోర్సులు

డైరెక్టర్ రామేశ్వరరావు వెల్లడి

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నాలుగు కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టనున్నారు. మంగళవారం ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరావు కోర్సుల వివరాలను వెల్లడించారు. ఆర్బిట్రేషన్‌లో ఏడాది వ్యవధితో గత పీజీ సర్టిఫికేషన్ కోర్సును ఆగస్టు మొదటి వారంలో క్లాసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో ఏడాది వ్యవధి గత పీజీ సర్టిఫికేషన్ కోర్సును కూడా ఆగస్టు నుంచే ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఒక్కో కోర్సు ఫీజు రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. రెండు కోర్సులకు ఫీజు జులై 30 వరకు కాలేజీలో చెల్లించవచ్చన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థును ఎంపిక చేస్తామన్నారు. ఆర్బిట్రేషన్ కోర్సులో చేరేవారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, ఫైనల్ చదివే వారు కూడా అర్హులని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీలో ఏదైని గ్రాడ్యుయేషన్ కోర్సులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే వారు కూడా అర్హులని పేర్కొన్నారు. కాగా.. ఒక ఏడాది కాల పరిమితితో కూడిన పీజీ డిప్లొమో ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ కోర్సులను ఎస్కీలోని స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్‌లో ప్రవేశ పెడుతున్నట్లు ఆయన వివరించారు. వీటి కోసం అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఫార్మా భూముల పరిశీలన

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో గత ప్రభుత్వం ఫార్మాసిటీకి సేకరించిన భూములతో పాటు మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలాన్ని మంగళవారం ధరణి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ తోపాటు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన కొంతమంది రైతులు వారిని కలిశారు. తమ భూములకు రాళ్ల పేరుతో పరిహారం ఇవ్వలేదని కొందరు, కబ్జాలో ఉన్నా పరిహారం అందలేదని మరికొందరు వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. వారి వెంట తహసీల్దార్ గోపాల్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోరుప్రోలు రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, చిర్ర సాయిలు, సరికొండ పాండు, దంతోజు నర్సింహాచారి, అనేగాని పాండుగౌడ్, కె.విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్.జగన్, డి.నర్సింహ, గొరిగె రాజు, గొర్రెంకల యాదయ్య, ఎ.సురేందర్ తదితరులు ఉన్నారు.



మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి, కేఎల్‌ఆర్ తదితరులు

బాధిత రైతులకు అండగా ఉంటాం

తుక్కుగూడ: జిన్నాయిగూడలో ఫ్యాబ్‌సిటీ సందర్భంగా భూములు కోల్పోయిన బాధిత రైతులకు అండగా ఉంటామని ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని జిన్నాయిగూడలో మంగళవారం బాధిత రైతు కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వారికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన పరిహారం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు భోద మాధవరెడ్డి, పార్టీ మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

- గ్రేటర్ పరిధిలో 14,624 స్కూల్ బస్సులు
- రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 11,922
- వీటిలో 3,500 కండిషన్ లేనివే ..
- నిబంధనలు పట్టించుకోని పాఠశాలలు
- విద్యా సంవత్సరం ఆరంభంలోనే హడావుడి
- ఆ తర్వాత గాలికొదిలేస్తున్న రవాణా శాఖ

ఏటా ప్రహసనంగా ఆర్టీఏ తనిఖీలు

బడి బస్సుల తనిఖీలు ప్రహసనంగా మారాయి. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో సామర్థ్యం లేని బస్సులను తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినా.. ఆ తర్వాత అవి మళ్లీ రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. మరోవైపు ఆర్టీఏ అధికారులు సైతం బస్సుల సామర్థ్యాన్ని నిర్ధారించడంలో కచ్చితమైన ప్రమాణాలను పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని విద్యాసంస్థలు కాలం చెల్లిన డొక్కు బస్సులను నడిపినా పట్టించుకోకుండా కొందరు ఎంవీఐలు ఉత్తుత్తి తనిఖీలు చేసి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



గ్రేటర్ పరిధిలో సుమారు 14,624 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోనే సుమారు 11,922 బస్సులు పిల్లలకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. వీటిలో సుమారు 3,500కు పైగా బస్సులు సామర్థ్యం లేనివి ఉన్నట్లు అంచనా. మరోవైపు సామర్థ్యం ఉన్నట్లు ధ్రువీకరించిన వాటిలోనూ ఏ మేరకు ఫిట్‌నెస్ ఉందనేది సందేహమే. ఏటా వారం రోజుల పాటు ఆర్టీఏ అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరామామూలుగా మారింది. దీంతో స్కూల్ బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కొన్ని విద్యాసంస్థలు తక్కువ జీతాలతో లభించే డ్రైవింగ్‌లో పెద్దగా అనుభవం లేనివారిని నియమిస్తున్నాయి. బస్సుల సామర్థ్యాన్నీ గాలికొదిలేస్తున్నాయి.

ఎందుకీ నిర్లక్ష్యం?

స్కూల్ బస్సుల కారణంగా జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను రూపొందించింది. నిబంధనలు, మార్గదర్శకాలను పేర్కొంది. ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. నిరంతర నిఘా విధానం లేకపోవడం, డ్రైవర్లపై ఎలాంటి నియంత్రణ, తనిఖీ లేకపోవడంతో బడి బస్సుల్లో పిల్లల భద్రత గాలిలో దీపంలా మారుతోంది.

స్కూల్ బస్సు ఇలా ఉండాలి..

- బస్సు పసుపు రంగులో ఉండాలి. రంగు పాలిపోయినట్లుగా కాకుండా స్పష్టంగా కనిపించాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి. బస్సు లోపలి భాగంలో పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి. దీంతో లోపల ఉన్న పిల్లలు కూడా డ్రైవర్‌కు కనిపిస్తారు.
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్ని మాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పొడి అందుబాటులో ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- సదరు పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపున ముందుభాగంలో స్పష్టంగా రాయాలి.
- సీట్ల కిందిభాగంలో బ్యాగులు పెట్టుకొనేలా అరలు ఏర్పాటు చేయాలి. పిల్లలు పట్టుకొనేందుకు వీలుగా అక్కడక్కడా లోహపు స్తంభాలను బస్సులో అమర్చాలి.
- వాహనానికి నలువైపులా పైభాగం మూలాల్లో (రూఫ్‌పై కాదు) బయటివైపు యాంబర్ (గాఢ పసుపు పచ్చని) రంగున్న ఫ్లాషింగ్ లైట్లను ఏర్పాటు చేయాలి. పిల్లలు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి.
- సదరు వాహనం స్కూల్ బస్సు అని తెలిసేలా ముందుభాగంలో పెద్ద బోర్డుపై 250 ఎంఎంకు తగ్గని విధంగా ఇద్దరు విద్యార్థులు (ఒక అమ్మాయి, ఒక అబ్బాయి) నల్లరంగులో చిత్రించి ఉండాలి. ఆ చిత్రం కింద ‘స్కూల్ బస్సు’ లేదా ‘కళాశాల బస్సు’ అని నల్ల రంగులో కనీసం 100 ఎంఎం సైజు అక్షరాల్లో రాయాలి. అక్షరాల గాఢత సైజు కనీసం 11ఎంఎం ఉండాలి.
- బస్సు తలుపులు సురక్షితమైన లాకింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సైడ్ విండోలకు అడ్డంగా 3 లోహపు కడ్డీలను ఏర్పాటు చేయాలి. సీటింగ్ సామర్థ్యం కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు.
- ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు 325 ఎంఎం ఎత్తుకు మించకుండా ఉండాలి. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి.
- లోపలికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకొనేందుకు వీలుగా ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్ ఉండాలి.
- బస్సులో ప్రయాణించే విద్యార్థుల పేర్లు, తరగతులు, చిరునామాలు, ఎక్కాల్సిన, దిగాల్సిన వివరాలు బస్సులో ఉండాలి.

డ్రైవర్ల అర్హతలిలా..

- డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి.
- యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకోసారి రక్తపోటు, షుగరు, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్, తదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. ప్రతి బస్సులో ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.
- డ్రైవర్‌కు బస్సు డ్రైవింగ్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.

అమలుకు నోచుకోని నిబంధనలు

- నిబంధనల్లో చాలా వరకు అమలుకు నోచుకోవడం లేదు.
- స్కూల్ బస్సుల భద్రతను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు.
- బస్సు లోపలివైపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవర్ నైపుణ్యాన్ని అంచనా వేయడంతో పిల్లలను జాగ్రత్తగా బస్సు ఎక్కించేందుకు, తిరిగి ఇళ్ల వద్ద దించేందుకు సిబ్బంది చూపే శ్రద్ధ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

జనావాసాల్లోకి కొండచిలువ



కొండ చిలువను పట్టుకుంటున్న స్నేక్ సొసైటీ సభ్యుడు

మణికొండ: పన్నెండు అడుగుల పొడవు కొండ చిలువ జనావాసాల్లోకి వచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ రోడ్డు నంబర్– 4లోని ఖాళీ స్థలంలో కొండచిలువ కనిపించింది. వెంటనే స్థానికులు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పట్టుకున్నారు. పాములు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వాటిని జూపార్కులో అప్పగిస్తామని స్నేక్ సొసైటీ సభ్యులు సూచించారు.

కవి విల్సన్ సుధాకర్‌కు ప్రతిష్టాత్మక రోమ్ పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: నాశ్చిరా అసోసియేషన్, బార్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక ‘డొన్నె డ్రీఅమోర్’ (ఉమెన్ ఆఫ్ లవ్) అంతర్జాతీయ అవార్డుకు తెలుగు కవి తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ ఎంపికయ్యారు. ఈ నెల 27న రోమ్ (ఇటలీ) వేదికగా అవార్డును స్వీకరించడానికి బార్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందిందని విల్సన్ సుధాకర్ తెలిపారు. మహిళా ప్రపంచానికి ప్రేరణగా రాసే సాహిత్యానికి గౌరవంగా ఈ అవార్డును అందిస్తారు. స్త్రీలపై సుధాకర్ రాసిన తెలుగు కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించగా.. ఆ కవిత్వం ఔన్నత్యాన్ని తెలుసుకొని దానిని ఇటాలియన్‌లోకి అనువదించి ఈ అవార్డుకు ఎంపిక చేశారని సుధాకర్ వివరించారు. నగరానికి చెందిన సుధాకర్ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా జపాన్, దక్షిణాఫ్రికా, దుబాయ్‌లలో విధులు నిర్వహించారు. పేదల పక్షపాతిగా, స్త్రీలు, బాలకార్మికులు, దళితులకు సంబంధించిన పలు అంశాలపై విల్సన్ సుధాకర్ రాసిన రచనలు ఆదరణ పొందాయి. ఆయన రాసిన పలు కవితలు ఆంగ్లం, ఇటాలియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన పట్టణ శివారులోని సీఏస్‌కే వెంచర్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ తుక్యానాయక్ కథనం ప్రకారం.. సీఎస్‌కే వెంచర్ సమీపంలో గల నిర్మానుష్య ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తి(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ తుక్యానాయక్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను స్థానిక రైతులను అడిగినా తెలియరాలేదు. వెంటనే మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులివ్వండి



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న కేశవులు, రమేశ్

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవిని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు అభ్యర్థించారు. నగరంలోని ఎంపీ నివాసంలో మంగళవారం ఆయన్ని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: బక్రీద్ సంద్భంగా పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ మంగళవారం కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి స్పెషల్ డ్రైవ్ సందర్భంగా జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు ఈ డ్రైవ్‌ను కొనసాగించాలని ఉప కమిషనర్ రవి కుమార్ అధికారులకు ఆదేశించారు. అధికారులు కార్యాలయంలోనే అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని సూచించారు.

శాస్త్రీయ సంరక్షణతో లాభాలు

- గొర్రెల పెంపకంలో పిల్లల ఆరోగ్యం ముఖ్యం
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి





పాలు మరిచే వరకు..

షాబాద్: గొర్రెల పెంపకం లాభాదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య పోషణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గొర్రె పిల్లల పెంపకంలో అవగాహన లేమితో చాలా మంది కాపరులు నష్టపోతున్నారు. వీటిని అధిగమించడానికి రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

పుట్టిన వెంటనే..

గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ముక్కు, నోరు మీద ఉండే పొర తొలగించి పొడి గుడ్డతో తుడవాలి. బొడ్డు దానంతట అదే విడిపోకపోతే రెండు అంగుళాలు కత్తిరించి అయోడిన్‌తో శుభ్ర పరచాలి. పుట్టిన గంటసేపటికి ముర్రుపాలు తాగించాలి. ముర్రుపాలలో విటమిన్ ఏ, డీ, ఈ ఉండడంతో వ్యాధి నిరోధక శక్తి నిచ్చే యాంటీబాడీలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. పిల్లలను విడిగా ఉంచి వెలుతురు, గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లో కట్టి వేయాలి. పిల్లలను చలి నుంచి సంరక్షించాలి.

పాలు మరిచే వరకు..

పాలు మరిచే వరకు(దాదాపు మూడు నెలలు) పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలను తల్లితో పాటు మందకు పంపకుండా కొట్టాంలో ఉంచి పెంచాలి. తల్లితో పాటు పంపితే శక్తి వృథా అయి పెరుగుదల తగ్గుతుంది. పిల్లలను గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలి. వరిగడ్డి పక్కలో వేస్తే వెచ్చగా ఉండి పిల్లలు మట్టి తినకుండా అరికట్టవచ్చు.

తల్లి పాలకు అదనంగా..

గొర్రె పిల్లల్లో పెరుగుదల మొదటి మూడు నెలల్లో ఎక్కువ ఉంటుంది. ఇలా అధిక పెరుగుదలున్నా గొర్రె పిల్లలే ముందు ఆరోగ్యంగా ఉండి ఎక్కువ బరువుతో ఉంటాయి. పాలు మరిచే వయసు వరకు తల్లి పాలకు అదనంగా పోషణనివ్వాలి. చిన్న గొర్రెలను నిదానంగా ఆకు తింటూ అవి జీర్ణించుకోవడానికి అలవాటు పడతాయి.

సమయానికి టీకాలు

తల్లి గొర్రెలను మేతకు పంపిన తర్వాత వేపాకు లేదా దాణా వేసి పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా అన్ని చూడాలి. మూడు నెలల వయసు దాటిన తర్వాత మొదటిసారి నట్టల నివారణ మందు ఇవ్వాలి. ఇది ఊపిరితిత్తుల్లోకి పోకుండా జాగ్రత్తగా తాపించాలి. దీని తర్వాత 10–15 రోజుల వ్యవధిలో చిటుకు వ్యాధి నివారణ టీకా ఇవ్వాలి. మరో 15 రోజులకు రెండో డోసు ఇవ్వాల్సి ఉంటుంది.



వేణుగోపాల స్వామి ఆలయంలో చదును చేసిన స్థలం

ఆలయ స్థలం అన్యాక్రాంతం

గుట్టుచప్పుడు కాకుండా చదును

బడంగ్‌పేట్: బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన సంతాన వేణుగోపాలస్వామి ఆలయ స్థలం అన్యాక్రాంతం అవుతుంది. ఆలయ రాజగోపురానికి దక్షిణ దిక్కుగా ఉన్న దాదాపు 200 గజాల స్థలాన్ని కొందరు చదును చేశారు. గ్రామస్తులకు తెలియకుండా చదును చేయడం వివాదాస్పదంగా మారింది. ఆలయ కమిటీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఈ వ్యవహారం నడిపిస్తున్నారని స్థానికంగా ఆరోపిస్తున్నారు. ఆలయంలో ఏ పనులు చేపట్టాలన్నా గ్రామ పెద్దలతో పాటు ఎండోమెంట్ అధికారుల అనుమతి తీసుకోవాలి. కానీ కమిటీ నిర్వాహకులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా యథేచ్ఛగా ఆలయ స్థలాన్ని చదును చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఆలయానికి వందల ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ప్రస్తుతం అవి వేరే వ్యక్తుల చేతుల్లో మగ్గుతున్నాయి.

సమాచారం లేదు



వేణుగోపాలస్వామి ఆలయానికి గ్రామస్తులందరూ కలిసి అభివృద్ధికి సహకరిస్తున్నారు. అలాంటిది గుట్టుచప్పుడు కాకుండా స్థానిక కార్పొరేటర్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా చదును చేస్తారు? అందులో ఏం చేస్తున్నారు? ఆలయ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలి.

– ఎర్ర మహేశ్వరి, కార్పొరేటర్

పన్ను చెల్లించు.. అభివృద్ధికి సహకరించు

సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నును చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. ఈ నెల 30వ తేదీ వరకు ఇంటి పన్నులు చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన బిల్లు కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బిల్ కలెక్టర్‌కు టార్గెట్ విధించామని, దానిని తప్పనిసరిగా రీచ్ అవ్వాలని సూచించారు. జూన్ నెలకు రూ.4 కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకనుగుణంగా వసూళ్లను పెంచాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయానికి రూ.64 కోట్ల టార్గెట్ విధించారని, ప్రస్తుతం రూ.23 కోట్ల ఆస్తిపన్ను మాత్రమే వసూలైందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తైబజార్ వేలం

మణికొండ: వారాంతం సంతలో తైబజార్ వసూలు చేసుకునేందుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో 16 మంది పాల్గొన్నట్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు. మహమ్మద్ దస్తగిరి రూ. 31.5 లక్షలకు వేలంను దక్కించుకున్నారని చెప్పారు. వేలం దక్కించుకున్న వారు రోజు వారిగా జరిగే వారంతం సంతలలో మాత్రమే తైబజార్ వసూలు చేయాలని సూచించారు. వీరికి 2025 మార్చి 31వ తేదీ వరకు గుడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

మేడ్చల్: మేడ్చల్ ఎక్సైజ్ సర్కిల్‌లోని దేవరయాంజాల్ గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం దేవర యాంజాల్ గంజాయి అక్రమ సరఫరా, విక్రయం జరుగుతుందనే సమాచారంతో అందడటంతో దాడి చేశారు. గ్రామంలో ఉన్న శంకర్‌భాగ్, సిబాకిలా అనే ఇద్దరు యువకులు గంజాయి సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకుని..మూడున్నర కిలోల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్, దేవరయాంజాల్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు, మేడ్చల్‌లో ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు నిందితులు గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్ : శ్మశాన వాటిక, పార్కు, నాలా స్థలాలను అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీఓ, తహసీల్దార్, జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బాబురావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, సీనియర్ నాయకులు జోగి రవి మాట్లాడుతూ.. ఉప్పర్‌పల్లి సర్వే నెంబర్ 144లో స్థల యజమాని పాపయ్య 500 గజాల స్థలాన్ని శ్మశాన వాటిక కోసం అందించారన్నారు. నాటి నుంచి చాకలి వారు ఈ స్థలాన్ని శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ స్థలంలో కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. అలాగే ప్రైవేట్ పాఠశాలకు చెందిన నిర్వాహకులు పార్కు స్థలం, నాలా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం శ్మశాన వాటికలోకి వెళ్లడానికి దారి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిలదీస్తే దాడులు దిగుతున్నారని వివరించారు. అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిసై దోపిడీలు

ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు

హిమాయత్‌నగర్: గంజాయి, వైట్నర్‌లకు బానిసలైన ముగ్గురు మైనర్లు దారి దోపిడీలకు పాల్పడుతుండగా నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ సీఐ చంద్రశేఖర్ విలేకరులకు తెల్పిన వివరాల మేరకు.. హిమాయత్‌నగర్ బర్గర్ కింగ్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే దినేష్ రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 13 వ తేదీన తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో హాస్టల్‌కు తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని సిటీ కేఫ్ సమీపంలోని స్ట్రీట్ నంబర్ 11 వద్ద అకస్మాత్తుగా బైకుపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి.. డబ్బు డిమాండ్ చేశారు. బాధితుడు తన వద్ద లేదని చెప్పడంతో వారు మొబైల్ ఇవ్వమని అడిగారు. అతను నిరాకరించడంతో దాడి చేసి కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడు దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు, వాహన తనిఖీలలో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు దోపిడీకి పాల్పడ్డారని నిర్ధారించి వారిని జువైనల్ హోంకు తరలించారు. వీరిలో ఓ మైనర్ ఓ గ్యాంగ్ రేప్ కేసులో గతంలో శిక్ష అనుభవించాడని ఏసీపీ తెలిపారు. ఇటీవల బొల్లారం పీఎస్ పరిధిలో ఓ టాటూ సెంటర్ లో టాటూ వేయించుకున్న ముగ్గురు మైనర్లు, ఆ టాటూ మిషన్‌ను కూడా దొంగిలించి, సొంతంగా టాటూలు వేసుకున్నారని తెలిపారు. వారి నుంచి యాక్టివా వాహనం, టాటూ మిషన్‌లను సీజ్ చేశారు.

నృత్య ప్రదర్శనలో రామాయణ ఘట్టాలు



జనక మహారాజు పాత్రలో కీర్తి

షాద్‌నగర్‌రూరల్: ఒడిశా రాష్ట్రంలోని రౌర్కెల పట్టణంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డాన్స్ ఫెస్టివల్‌కు నటరాజ కళానిలయం విద్యార్థిని కీర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నృత్య శిక్షకురాలు సురభి శారద బృందం సభ్యులు రామాయణంలోని వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. కీర్తి జనక మహారాజు పాత్రలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మానపాటి ప్రదీప్‌కుమార్ ఆమెని అభినందించారు.

సజావుగా యూజీసీ నెట్ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు

కడ్తాల్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పోస్ట్ కోసం దరఖాస్తు చేయడానికి అర్హతను నిర్ణయించే యూజీసీ(యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్) నెట్ పరీక్షను మంగళవారం నిర్వహించారు. దీనికి కడ్తాల్ మండల కేంద్రంలోని ఫార్చున్ బటర్‌ఫ్లై సీనియర్ సెకండరీ స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఉదయం సెషన్‌కు 276 మంది అభ్యర్థులకు గాను 182 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 600 మందికి గాను 478 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లు సునీల్, సుజాత, డిప్యూటీ అబ్జర్వర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం నిర్వహణలో సూపరింటెండెంట్ రంగారావు, డిప్యూటీ సెంటర్ సూపరింటెండెంట్ భుజంగరావు, పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ తదితరులు ఉన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శంషాబాద్: మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన నల్లచెరువులో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వందేళ్లుగా చెరువుకు సంబంధించిన హక్కులన్నీ గ్రామస్తులకు ఉన్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మట్టితవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవినాయక్, కె. వెంకటేశ్, శంకరయ్య, చిన్న, లాలుసింగ్, బాలూనాయక్ తదితరులున్నారు.

బంగారంతో బురిడీ

- తక్కువ ధరకు విక్రయిస్తామంటూ మోసం
- నకిలీ బంగారం చేతిలో పెట్టి పరార్
- అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించిన పోలీసులు
- నకిలీ బంగారం, కరెన్సీ స్వాధీనం
- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మార్కెట్ ధర కంటే తక్కువకు బంగారం బిస్కెట్లు విక్రయిస్తామని బంగారం వ్యాపారులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మూడు కార్లు, కానిస్టేబుల్ దుస్తులు, రూ.6.86 కోట్ల నకిలీ నగదు, 5 కిలోల నకిలీ బంగారం బిస్కెట్లు, రూ.51 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన కర్రెద్దుల విజయ్ కుమార్ అలియాస్ కృష్ణ మోహన్ చౌదరి, బోగిరి సునీల్ గవాస్కర్ అలియాస్ హరీష్, నంబూరి డేవిడ్ అలియాస్ సెంథిల్, అడిగోపుల ఓంసాయి కిరిటీలు కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి కొనుగోలు చేసిన బంగారం తమ దగ్గదర ఉందని, తక్కువ ధరకే విక్రయిస్తామని వ్యాపారస్తులను సంప్రదించేవారు. ఈక్రమంలో బోడుప్పల్‌కు చెందిన సింగిరెడ్డి సురేష్ రెడ్డి ద్వారా స్థానిక వ్యాపారి శ్రీదిలీప్ బర్వాకు ఈ విషయం తెలిసింది. దీంతో ఇరువురు కలిసి గత నెల 19న బెంగళూరుకు వెళ్లి, విజయ్‌కుమార్, హరీష్‌లను కలిశారు. దిలీప్ దగ్గరి నుంచి రూ.6 లక్షలు తీసుకొని 81 గ్రాముల బంగారం ఇచ్చారు. నాలుగు రోజుల తర్వాత హరీష్ బోడుప్పల్‌కు వచ్చి దిలీప్‌కు అదనంగా 20 గ్రాముల బంగారాన్ని ఇచ్చాడు. దీంతో పూర్తిగా విశ్వసించిన దిలీప్ 2 కిలోల బంగారం కావాలని ఆర్డర్ చేశాడు. రూ.20 లక్షల నగదు చెల్లించాడు. మిగిలిన రూ.90 లక్షల నగదును గత నెల 29న స్నేహితుడు సురేష్‌తో కలిసి బెంగళూరులోని టీసీ పాళ్యంకు వెళ్లి విజయ్‌కుమార్‌కు ఇచ్చారు. వీరి సమక్షంలోనే విజయ్ 5 కిలోల బంగారాన్ని ఇతరులకు విక్రయించాడు. ప్రస్తుతం స్టాక్ లేదని చెప్పి వారిని తిరిగి పంపించేశాడు.

చెన్నైకి తీసుకెళ్లి..

గత నెల 30న మేనేజర్ నంబూరి డేవిడ్‌ను కలిసేందుకు దిలీప్‌ను విజయ్ కుమార్ చెన్నైలోని లీ రాయల్ మెరిడియన్ హోటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రోడ్ నం –35లో బంగారాన్ని తీసుకోవాలని డేవిడ్ వారికి సూచించాడు. దీంతో హైదరాబాద్‌కు దిలీప్ తిరుగు ప్రయాణమయ్యాడు. ఇక అంతే అప్పట్నుంచి దిలీప్‌తో కమ్యూనికేషన్ కట్ చేసేశారు. మోసపోయానని గ్రహించిన దిలీప్ ఈనెల 8న మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు కీసర వద్ద నలుగురు నిందితులను పట్టుకున్నారు.

నకిలీ పోలీసుగా హడావుడి..

బాధితులను నమ్మించేందుకు వారి మనుషులనే కస్టమర్ల రూపంలో పెట్టేవారు. బాధితుల సమక్షంలోనే నకిలీ కరెన్సీతో, నకిలీ బంగారం బిస్కెట్లను విక్రయించేవారు. దీన్ని కళ్లారా చూసిన బాధితులు నిజమని నమ్మేవారు. దీంతో వారికీ తక్కువ ధరకు బంగారం కావాలని నిందితులను సంప్రదించేవారు. ప్రస్తుతం బంగారం లేదని, అడ్వాన్స్ చెల్లిస్తే కొద్ది రోజుల్లో అందజేస్తామని నమ్మించేవారు. ఆ తర్వాత నిందితులు నకిలీ బంగారం బిస్కెట్లు తీసుకొచ్చి, బాధితులకు అందజేసే క్రమంలో నకిలీ పోలీసు అధికారి జోక్యం చేసుకుంటాడు. దీంతో నిందితులు, బాధితులు ఇరువురూ అక్కడ్నుంచి పరారవుతారు. ఇప్పటికే నిందితులు విజయ్ కుమార్‌పై కావలి టు టౌన్ ఠాణాలో 13 కేసులు, నంబూరి డేవిడ్‌పై రెండు కేసులున్నాయి.